క్లుప్తంగా

గుత్తి కోట అద్భుతం



గుత్తి కోటపై కుటుంబ సభ్యులతో విశాల్ ఫెర్రర్

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ కితాబిచ్చారు. కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఆమె గుత్తికోటకు ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. గుత్తి కోట చరిత్ర గురించి వారు వివరించారు. విశాలా ఫెర్రర్ మాట్లాడుతూ గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్, యువజన సమితి కన్వీనర్లు చిరంజీవి, జిలాన్, అర్షద్, సభ్యులు శివ, బాషా, పురావస్తు శాఖ సిబ్బంది అమృత్, కృష్ణ చైతన్య, ఆంజనేయులు, చంటి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తాడిపత్రి రూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు ద్వారా సీట్లను భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. పాలిటెక్నిక్ తుదివిడద అడ్మిషన్ల అనంతరం మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. పాలిసెట్‌లో ఉత్తీర్ణత పొంది ఎక్కడా అడ్మిషన్లు పొందని వారు, ఉత్తీర్ణత పొందని వారు, పదో తరగతి పాసై పాలి సెట్ రాయని విద్యార్థులు కూడా స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనవచ్చున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 30వ తేదీ లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు.

1న క్రిష్టిపాడులో గరిడి ఉత్సవం

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడులో ఆగస్టు 1న గరిడి ఉత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఏటా గ్రామస్తులంతా ఐకమత్యంతో ఉత్సవాన్ని నిర్వహించం ఆనవాయితీ అన్నారు. ఈ సంవత్సరం కూడా గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా అందరూ కలసి పెద్ద గరిడి, చిన్న గరిడి ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

నెట్టికంటుడి సేవలో డీఆర్ఎం



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న డీఆర్ఎం విజయ్‌కుమార్ దంపతులు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ ఎం.విజయ్‌కుమార్ దంపతులు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామునే ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామి తీర్థప్రసాదాలను డీఆర్ఎం దంపతులకు అందజేశారు.

నారప్పతాతకు ప్రత్యేక పూజలు



పెద్దపప్పూరు: ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నయక్కలూరు గ్రామ సమీపంలో వెలసిన నారప్పతాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచేగాక పెద్దవడుగూరు, యాడికి, నార్పల మండలాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి యజ్ఞోపవీతం వితరణ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి యజ్ఞో పవీతం వితరణ చేస్తున్న దంపతులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అనంతపురం సమీపంలోని నారాయణపురానికి చెందిన బళ్లారి వెంకటరాముడు, మల్లేశ్వరి దంపతులు వెండి యజ్ఞోపవీతం వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు మాట్లాడుతూ నారాయణపురానికి చెందిన దంపతులు రూ.9,500 విలువ చేసే 10 తులాల వెండి ఆభరణాలు ఉచితంగా అందజేశారన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయాలు, పొలాలే టార్గెట్

- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న రైతులు, ప్రజలు
- గార్లదిన్నెలో విచ్చలవిడిగా చోరీలు



గార్లదిన్నె: సాధారణంగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. అయితే దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. ఆలయాల్లో హుండీలు, పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై గురిపెట్టారు. తాజాగా మండలంలో ప్రసిద్ధి చెందిన కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, యర్రగుంట్ల నల్లమ్మ ఆలయంలో హుండీల్లోని కానుకలు దోచుకోవడంతోపాటు పొలాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాల్లో జరిగిన చోరీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ దుండగులను పోలీసులు పట్టుకోలేదని పలువురు రైతులు వాపోతున్నారు.

స్టార్టర్, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

ఇటీవల మండలంలో వరుసగా పొలాల్లో విద్యుత్ స్టార్టర్లు చోరీలకు గురవుతున్నాయి. ఈ నెలలో బూదేడు, గార్లదిన్నె, కల్లూరు, పెనకచెర్ల, సంజీవపురం, పాపినేపాళ్యం, ముకుందాపురం, యర్రగుంట్ల, కమలాపురం, కొట్టాలపల్లి మర్తాడు, కోటంక గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించారు. రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేసి పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగుల గొట్టి,అందులోని రాగి తీగలను దుండ గులు ఎత్తుకెళ్తున్నారు. మార్కెట్‌లో కిలో రాగి కడ్డీ రూ.1000 పలుకుతోంది.ఇదే అదునుగా పొలాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే గార్లదిన్నె, పాపినేపాళ్యం గ్రామాల్లో మంచి నీటి బోరుకు సంబంధించిన స్టార్టర్లను దుండగులు ఎత్తుకెళ్లారు.

ఆలయాల్లో ..

మండలంలో కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో హుండీలు, వెండి, బంగారు ఆభరణాలు, యర్రగుంట్ల నల్లమ్మ ఆలయంలో హుండీలు, గార్లదిన్నె షిరిడి సాయిబాబా ఆలయంలో గంటలు, కొట్టాలపల్లి సుంకలమ్మ ఆలయంలో గంటలు, దుండగులు ఎత్తుకెళ్లారు. కోటంకలో జరిగిన చోరీని పోలీసులు చేధించారు. మిగిలిన ఆలయాల్లో జరిగిన చోరీలను పోలీసులు చేధించలేదు.

వేలాది రూపాయల నష్టం



నాలుగు ఎకరాల్లో చీనీ పంట సాగు చేశాను. చీనీ చెట్లకు నీరు అందించేందుకు ఇటీవల కొత్తగా బోరు వేసి, రూ.11,500 వెచ్చించి కొత్త స్టార్టర్ పెట్టె, పంపు సెట్ బిగించాను. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తోటలోకి వెళ్లి విద్యుత్ స్టార్టర్ పెట్టె దొంగలించారు. మా గ్రామంలో వరుసగా వ్యవసాయ పొలాల్లో స్టార్టర్ పెట్టెలు చోరీకి గురి అవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాను. పోలీసులు న్యాయం చేయాలి.

– మునెయ్య, రైతు, బూదేడు

నిఘా ఉంచాం



మండలంలో ఆలయాలు, పొలాల్లో జరిగే చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాం. త్వరలో దొంగలను పట్టుకుంటాం. పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ పెట్టెలు చోరీకి గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి గ్రామంలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి రాత్రి సమయంలో గస్తీ నిర్వహించి చోరీలపై అప్రమత్తం చేస్తాం. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– మహమ్మద్ గౌస్, గార్లదిన్నె ఎస్‌ఐ



బూదేడులోని తోటలో స్టార్టర్ చోరీకి గురైన దృశ్యం

అమ్మవారికి బోనాలు



త్రిపుర సుందరీ అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

గుంతకల్లు: పాత గుంతకల్లు నాగప్ప కాలనీలోని త్రిపుర సుందరీ బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు మోస్తూ ఆలయం నుంచి ఊరేగింపుగా పాత గుంతకల్లు ఊరువాకిలిలోని బొడ్రాయి వరకూ నిర్వహించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి రాముస్వామి, నిర్వాహకులు జి.లక్ష్మీనారాయణ, నీలకంఠ, సత్యనారాయణ, జి.రవికుమార్, ఎం.వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి తరిమెల నాగిరెడ్డి



తరిమెలలో నాగిరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు



గార్లదిన్నెలో తరిమెల నాగిరెడ్డి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

శింగనమల/గార్లదిన్నె/గుంతకల్లు టౌన్: పేదల కోసం నిరంతరం పోరాటాలు చేసి, వారి హృదయాల్లో తరిమెల నాగిరెడ్డి నిలిచిపోయారని సీపీఐ(ఎంఎల్) వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ అన్నారు. తరిమెల నాగిరెడ్డి 48వ వర్ధంతి సందర్భంగా శింగనమల మండలంలోని తరిమెల గ్రామంలో ఆయన స్థూపం వద్ద జోహార్లర్పించారు. ఆమె మాట్లాడుతూ తరిమెల నాగిరెడ్డి ఒక నాయకుడిగా, విప్లవకారుడిగా దశ దిశ చూపించారన్నారు. ఆయన ఆశయాలను రైతులు, రైతు కూలీలు, శ్రామికులు, , పేద, మధ్య తరగతి వారు ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు, గ్రామ పెద్దలు ఎల్లారి గోవర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి నాగిరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణ, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లులోని స్థానిక న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తరిమెల నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. కార్యక్రమంలో కర్నూల్ జిల్లా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి మల్లికార్జున, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మణి, న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, నాయకులు రఘునాథరెడ్డి, హనుమంతు, సత్తార్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం



బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

గుత్తి రూరల్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నంటినీ తప్పకుండా అమలు చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో ఉన్న బాట సుంకులమ్మను ఆదివారం ఆయన దర్శించుకున్నారు. మంత్రికి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నంటినీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ సామాజిక భద్రత పింఛన్లు పెంచి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి గుత్తి పట్టణంలోని అనంతపురం రోడ్డులో విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద 108 శీనా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 108 శీనాతో పాటు లయన్స్ క్లబ్ నాయకులు విరూపాక్షి రెడ్డి, రాఘవేంద్ర స్వామి(చిన్ని), జిలాన్, మక్బూల్ , సురేష్‌బాబు తదితరులు డయాలసిస్ రోగుల సౌకర్యార్థం గుత్తి ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీరాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య 150 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట మంత్రి సత్యకుమార్‌ను స్థానిక బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం అనంతపురంలో మంత్రిని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ క్రిష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్, పురందర్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు చిరంజీవి

తాడిపత్రి అర్బన్: రాష్ట వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూ పార్క్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా అప్పట్లో మహానేత డాక్టర్ వైఎస్సార్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. తద్వారా రాష్ట వ్యాప్తంగా 4 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు లబ్ధి పొందారన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 32వేల మంది కార్మికులు సంక్షేమ బోర్డుకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే ఉప్పు శ్రీనివాస్, కన్వీనర్ ఉమాగౌడ్, కో–కన్వీనర్ రమణ, పట్టణ సహాయ కార్యదర్శి రామాంజనేయులు, చేతి వృత్తిదారుల సంఘం నియోజకవర్గ కార్యదరి సూరి రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పౌష్టికాహార నిపుణులను సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధర్మవరానికి చెందిన పౌష్టికాహార నిపుణులు ప్రసాద్, గీతాంజలి సూచించారు. స్థానిక రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ప్రాముఖ్యతను ఎన్ఎస్ఎస్ విభాగం సేవా నిరతిని తెలుపుతూ ఈ నెలను పౌష్టికాహార నెలగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఇన్నర్‌వీల్ క్లబ్ కౌసర్ బేగం, కార్యదర్శి రేణుకాదేవి, కోశాధికారి శ్రీవాణి, సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆర్డీటీ క్రికెట్ పోటీలు



బహుమతులందుకుంటున్న క్రీడాకారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఫాదర్ ఫెర్రర్ విన్సెంట్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరా హోరీగా సాగాయి. ఆదివారం టోర్నీ ఫైనల్‌లో అనంత విద్యానికేతన్ జట్టుపై వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విజయం సాధించి, ఫాదర్ ఫెర్రర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, క్యాంపస్ మేనేజర్ అరుణ బహుమతులను ప్రదానం చేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అనంత విద్యానికేతన్ క్రీడా కారుడు జగన్, బెస్ట్ బౌలర్ వాణీ స్కూల్ క్రీడాకారుడు గణేష్ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేష్, అంపైర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం



రుక్మిణీ సమేత పాండురంగస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న పాండురంగస్వామి ఆలయంలో ఆదివారం రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలి ఏకాదశి నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఉదయం రుక్మిణీ సమేత పాండురంగస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష పూజలు చేశారు. ఉదయం 11గంటలకు రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అమ్మరు, స్వామి వారికి పుస్తెలు, మెట్టెలు, తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు అమ్మవారికి మాంగళ్య ధారణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం 1గంటకు రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ప్రతిష్ఠించి మెయిన్ బజార్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నీలగిరి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలోని నీలగిరిస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థప్ర సాదవినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ జయ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరై వినతులు స్వీకరించాలన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన షేక్షావలి

యాడికి: మండలంలోని రాయలచెరువు ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గుత్తిలోని సీపీఐ కాలనీకి చెందిన షేక్షావలి తన అత్తగారి ఊరైన యాడికి మండలం రాయలచెరువుకు ఆటోలో వచ్చాడు. తిరిగి గుత్తికి వెళ్తుండగా రాయలచెరువు ఉన్నత పాఠశాల దాటిన తర్వాత ఆటో పల్టీ కొట్టింది. ఘటనలో అతడు ఆటో కిందపడడంతో కాలికి, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆటోను పక్కకు తొలగించి, గాయపడిన అతడిని అదే ఆటోలో రాయలచెరువు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం 108లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన ఈశ్వరయ్య

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేట గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. పామిడి మండలం గజరాంపల్లికి చెందిన ఈశ్వరయ్య ద్విచక్ర వాహనంలో అనంతపురానికి వెళ్తుండగా అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ఈశ్వరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని..



గాయపడిన గోవిందరెడ్డికి చికిత్స అందజేస్తున్న వైద్యులు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో గోవిందరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పుట్లూరు మండలం చిక్కేపల్లికి చెందిన రైతు గోవిందరెడ్డి ట్రాక్టర్ మరమ్మతులకు గురైంది. దీంతో గుత్తికి వచ్చి విడిభాగాలను కొనుగోలు చేసి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. కొత్తపేట గ్రామ శివారులో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కోడి గుడ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. భార్య పట్ల భర్త ప్రేమ కలిగి ఉండాలన్నారు. భర్త పట్ల భార్య భయం కలిగి జీవించాలన్నారు. తద్వారా వారి దాంపత్య జీవితం దేవుడికి మహిమకరంగా దీవించబడుతుందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, పీసీ రత్నరాజు, బుజ్జిబాబు, రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణమ్మ, మంజుల, శాంతమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, ప్రశాంతి, వాణి, మహిమ, లత, జ్యోతి, భాగ్యమ్మ, రజని తదితరులు పాల్గొన్నారు.